క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాటారం: సరస్వతి పుష్కరాల దృష్ట్యా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఏర్పాటులో భాగంగా మల్హర్ మండలం వలెంకుంట, తాడిచర్ల 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా కాటారం, మల్హర్ మండలంలోని పలు సబ్ స్టేషన్ల పరిధిలో నేడు(శనివారం) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాటారం మండలం ధన్వాడ, గంగారం, దామెరకుంట, మల్హర్ మండలం కొయ్యూర్, రుద్రారం, తాడిచెర్ల, పెద్దతూండ్ల, మల్లారం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సరఫరా అంతరాయానికి సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం



టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(వి) గ్రామానికి నాంపెల్లి మహేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు దొంతుల శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించి, ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన వెంట మండల ప్రధాన కార్యదర్శి మాదం కొమురయ్య, బండి రవి, పొన్నం సాంబయ్య, శాస్త్రాల కిరణ్, తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కాటారం: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన కాటారం మండలం బస్వాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గడవేణ సతీశ్‌కు చెందిన పాడి గేదె పశుగ్రాసం నిమిత్తం గ్రామ శివారులోని పంట పొలాల్లోకి వెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ స్తంభానికి అమర్చిన సపోర్ట్ వైర్‌ను తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు సతీశ్ వేడుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మల్లంపల్లి మండలం పందికుంట సమీపంలో చోటు చేసుకుంది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. ములుగుకు చెందిన గొర్రె మల్లేశ్(35) బంధువుల వివాహానికి వెళ్లాడు. పెళ్లి వద్ద ఏటూరునాగారానికి చెందిన బంధువు నూనేటి లక్ష్మణ్ కలసి మల్లంపల్లి వరకు వెళ్లి వద్దామని పిలువగా ఇద్దరు కలిసి మల్లంపల్లికి వెళ్లి పని ముగించుకొని తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బండ రాయిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మల్లేశ్ పరిస్థితి విషమంగా ఉండడంతో హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?

- అసంపూర్తిగా ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం
- వైద్యం కోసం ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



భవనంలో బీర్ బాటిల్



సుల్తాన్‌పూర్‌లో అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవనం

రేగొండ: కొత్తపల్లిగోరి మండలంలోని సుల్తాన్‌పూర్‌లో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. అధికారుల అలసత్వం కారణంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. చికిత్స కోసం 10 కిలోమీటర్లు పోవాల్సిన పరిస్థితి సుల్తాన్‌పూర్ గ్రామంలో నెలకొంది. ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనులను గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.20 లక్షల అంచన వ్యయంతో ప్రారంభించారు. కాగా కొత్త ప్రభుత్వం ఏర్పడి పదహారు నెలలు గడిచినప్పటికీ అసంపూర్తిగానే ఉంది. అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరించడంతో భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు కేటాయించి అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనులు పూర్తి చేయించి వైద్యం అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- తహసీల్దార్ శ్వేత



దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్వేత

రేగొండ: భూసమస్యల పరిష్కారం కోసం మండలంలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్వేత అన్నారు. శుక్రవారం మండలంలోని కనిపర్తి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 320 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

గిరిజనులపై ఎన్ఎస్ఎస్ వలంటీర్ల అధ్యయనం



మాట్లాడుతున్న రమాదేవి

ఏటూరునాగారం: మండలంలోని బూటారం, గంటలకుంట, తదితర గిరిజనుల ప్రజలపై వరంగల్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రెండు రోజులపాటు అధ్యయన కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం మండలంలోని బూటారంలో ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి తులరవి మాట్లాడారు. గిరిజనుల స్థితిగతులపై వలంటీర్లు అధ్యయనం చేశారన్నారు. వారి జీవన శైలి, ఆర్థిక వనరులు, నిత్యం రోజు చేసే దినచర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు అడవుల్లో జీవించే ప్రజల జీవనవిధానంపై అధ్యయనం చేశారన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల ఏ విధంగా అందుతున్నాయని ఆరాతీశారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



టేకుమట్ల: వైష్ణవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



వల్లెకుంటలో బడిబాట ర్యాలీలో ఉపాధ్యాయులు

- ఎంఈఓ సుధాకర్

టేకుమట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య నందిస్తున్నట్లు మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కందికట్ల వైష్ణవి మండల టాపర్‌గా నిలువగా ఆమెను పాఠశాలలో ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించించారు. అలాగే మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించే విధంగా విద్యాబోధన జరుగుతుందని అన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు కవిత, పంకజ, అనిత, అంకూస్, రమాదేవి, అనురాధ, తదిరులు ఉన్నారు.

మల్హర్: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని వల్లెకుంట జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం టీ సుదర్శనమ్ అన్నారు. మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. వల్లెకుంటలో హెచ్ఎం సుదర్శనమ్ మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా పాఠశాలలో 10 తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన, ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులతో బోధన చేస్తున్నట్లు తెలిపారు. బడి ఈడు కలిగిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ సమ్మయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు తదిరులు పాల్గొన్నారు.

ముస్లింల ప్రార్థనలు

చిట్యాల: ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పోరాడుతున్న భారత సైనికులకు మద్దతుగా మండల కేంద్రంలోని కౌసర్ ఏ మసీదులో ముస్లింలు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు రాజ్‌మహ్మద్ మాట్లాడుతూ.. పాకిస్తాన్ ఉగ్రవాదులు జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో విహార యాత్రకు పోయిన అమాయకులైన 26 మందిని కాల్చి చంపడం అన్యాయమన్నారు. దానికి ప్రతీకారంగా మన ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపైన మాత్రమే దాడి చేశారని అన్నారు. కానీ వక్రబుద్ధి గల పాకిస్తాన్ భారత్‌లోని సరిహద్దు ప్రాంతాల పైన, అమాయక ప్రజలపైన దాడి చేస్తూ యుద్ధం చేస్తుందన్నారు. యుద్ధంలో మన భారత సైన్యానికి ఆత్మస్థైర్యాన్ని కలిగించి నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు అధ్యక్ష, కార్యదర్శులు అజ్మత్‌మియా, హైదర్ పాషా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న ట్రాన్స్‌జెండర్లు

కాటారం: మండలంలోని మద్దులపల్లికి చెందిన మారుపాక దుర్గయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు నిరుపేదలు కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌జెండర్లు శుక్రవారం దుర్గయ్య కుటుంబాన్ని పరామర్శించారు. నగదు, బియ్యంతో పాటు వంట సామగ్రి, కూరగాయలను అందించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లు అడువాల రూప, గౌరి, శాన్విత, మోక్ష, ప్రూటీ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు దగ్ధం

శాయంపేట : మండలంలోని ఆరెపల్లి గ్రామ శివారులో అవెన్యూ ప్లాంటేషన్‌లో మంటలు చెలరేగాయి. రైతులు కంకులు ఆరబోసి మిషన్‌లో వేసి జొన్నలు పట్టిన అనంతరం కంకి పొట్టును, బెండ్లను రోడ్డు పక్కన పడేయడంతో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం నిప్పుపెడుతున్నట్లు సమాచారం. దీంతో అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు అర కిలోమీటర్ మేర మొక్కలు దగ్ధమయ్యాయి.

నూతన సబ్‌స్టేషన్‌తో నిరంతర విద్యుత్

- కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న



పనులు పరిశీలిస్తున్న వెంకన్న

ఏటూరునాగారం: నిరంతరం పల్లె ప్రజలకు విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అదనంగా రొయ్యూర్ ప్రాంతంలో నూతన సబ్‌స్టేషన్‌ను రూ.1.80కోట్లతో నిర్మించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న తెలిపారు. శుక్రవారం మండలంలోని రొయ్యూర్‌లో సబ్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని లెవలింగ్ పనులు పరిశీలించారు. మంత్రి సీతక్క కృషితో సబ్‌స్టేషన్ మంజూరయిందన్నారు. సబ్‌స్టేసన్ పూర్తి అయితే మరింత నాణ్యమైన విద్యుత్ ప్రజలకు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దొంగిరి మధుబాబు, మండల సహాయ కార్యదర్శి ముమ్మనేని రమేష్, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కొనసాగించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్



సమ్మె నోటీస్ అందజేస్తున్న రవీందర్

ములుగు రూరల్ : కార్మిక చట్టాలను కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్‌కు ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆస్పత్రి కార్మికులు పాల్గొనున్నట్లు తెలియజేస్తూ సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా కుదించడం కార్మికులకు తీరని నష్టం అని అన్నారు. సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రమేష్, బాలు, మాన్‌సింగ్, సంధ్య, కళావతి, దీపిక, జ్యోతి, రాకేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

15న ఇంటర్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్

కాటారం: మండల కేంద్రంలోని బాలుర, బాలికల గిరిజన గురుకుల కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్‌లో ప్రవేశం కోసం ఈ నెల 15న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు బాలుర కళాశాల ప్రిన్సిపాల్ రాజేందర్, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తెలిపారు. ఏటూరునాగారం స్పోర్ట్స్ స్కూల్‌లో ఉదయం 10 గంటల నుంచి కౌన్సిలింగ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఎసెస్సీ మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్, కులం, ఆదాయం, నివాసం ధృవీకరణపత్రాలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్, ఒరిజినల్, రెండు సెట్ల జిరాక్స్‌లు వెంట తీసుకొని రావాలని సూచించారు. కాటారం గిరిజన బాలుర కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, పీటీ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్స్ తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘నిరుపేదలకు అందని ఇందిరమ్మ ఇళ్లు’

మొగుళ్లపల్లి: నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు అందడం లేదని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టిఐ జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అన్యాయం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, గ్రామసభలో పేర్లు ఉన్నప్పటికీ, కొందరు లబ్ధిదారుల పేర్లను తొలగించారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలన్నారు.

కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలం

మంగపేట: తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులకు పట్టదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన నారాయణస్వామి అనే రిటైర్డ్ ఉద్యోగి స్థానిక రెవెన్యూ కార్యాలయంలోని కొందరు ఉద్యోగుల సహకారంతో 2004లో 107 సర్వే నంబర్‌లోని 242 గజాల స్థలాన్ని అసైన్ మెంట్ ద్వారా మంజూరీ చేసినట్లు తప్పుడు పత్రాలను సృష్టించి 2025లో ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డు వెంట ఉన్న సుమారు రూ. కోటి విలువైన స్థలాన్ని ఆక్రమించుకుని రేకులషెడ్డు నిర్మించినట్లు స్థానికులు తెలుపుతున్నారు. అయినా రెవెన్యూ అధికారులు చూసీచూనట్లుగా వ్యవహరించడంతో ఏకంగా ఇంటి నిర్మాణం పనులు చేపట్టేందుకు బోరుబావి నిర్మిస్తుండగా స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు పనులను నిలిపివేయించారు. అప్పటి నుంచి ఎలాంటి పనులు చేపట్టకుండా ఉండిపోయిన నారాయణ స్వామి కొందరు స్థానికులు ఓ రెవెన్యూ ఉద్యోగి సహకారంతో శుక్రవారం ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోయించేందుకు కొలతలు వేయించడం గమనార్హం. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్‌ను వివరణ కోరగా భూమికి సంబంధించిన పూర్తి ఆధారాలు తీసుకురావాలని అప్పటి వరకు అనుమతి లేకుండా ఎలాంటి పనులు చేపట్టొద్దని హెచ్చరించామన్నారు. అయినా పనులు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు



ముప్పనపల్లిలో రోడ్డు పక్కన పడేసిన చెత్త కుప్పలు



కన్నాయిగూడెంలో చెత్తను కుప్పలుగా పడేసిన సిబ్బంది

ఖాళీ స్థలంలో, రోడ్ల వెంట పడేస్తున్న చెత్త

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



బుట్టాయిగూడెంలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డు

కన్నాయిగూడెం: గత ప్రభుత్వం గ్రామాలను పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక డంపింగ్ యార్డు ఏర్పాటు చేసింది. మండలంలో 11 గ్రామ పంచాయతీలు ఉండగా గ్రామ పంచాయతీకో డంపింగ్ యార్డు చొప్పున 11 ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుల్లో గ్రామ పంచాయతీ సిబ్బందితో సేకరించిన చెత్తను వేరు చేసి కొంత పేడ, మట్టితో సేంద్రియ ఎరువు తయారు చేసి రైతుల పంటపొలాలకు ఉచితంగా ఎరువును అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారు. కానీ అధికారులు మాత్రం అడపాదడపా చెత్తను ట్రాక్టర్ ద్వారా సేకరించి గ్రామ చివరలో పడేసి చేతులు దులుపుకుంటుటున్నారు. మండలంలో ఎంపీడీఓ పంచాయతీ అధికారులతో అవగాహన చేసి ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నప్పటికీ పెడచెవిన పెట్టడంతో పంచాయతీ సిబ్బంది అంటి ముట్టనట్టుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు చొరవ తీసుకొని సేకరించిన చెత్త ద్వారా కంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు అందించి రైతులకు బాసటగా నిలువాలని పలువురు కోరుతున్నారు.

రోడ్ల వెంట వేస్తున్న చెత్త

గ్రామాల్లో ప్రజల వద్ద నుంచి ట్రాక్టర్‌లతో సేకరించిన చెత్తను గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రధాన రహదారుల వెంట పోస్తున్నారు. దీంతో ప్రయాణికులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన రావడంతో రోడ్డు వెంట వెళ్లలేక పోతున్నామని వాపోతున్నారు. అక్కడ పడేసిన చెత్తకు నిప్పు పెట్టడంతో గ్రామంలోకి గాలితో రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి

మండలంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకురావాలి. లక్షల రూపాయలతో ఏర్పాటు చేశారు కానీ వాడకుండా ఇళ్ల నుంచి తెచ్చిన చెత్తను బయట పడేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకొని సేంద్రియ ఎరువును తయారు చేయించి రైతులకు ఇవ్వాలి.

– బి.కాటమ్‌రెడ్డి, ముప్పనపల్లి

ఎరువుగా రైతులకు అందించాలి

చెత్తను తీసుకువచ్చి డంపింగ్ యార్డులో వేరు చేసి కంపోస్టు ఎరువు తయారు చేయాలి. రైతులు వేసే పంటలకు ఎరువులు ఎంతగానో ఉపయోగపడుతాయి. అధికారులు దృష్టి పెట్టి ఎరువులు తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– జె.నర్సింహారావు, బుట్టాయిగూడెం రైతు

ఎరువు తయారు చేయిస్తున్నాం..

డంపింగ్ యార్డుల్లో గ్రామాల నుంచి చెత్తను సేకరించి ఎరువును తయారు చేయిస్తున్నాం. కాకపోతే కొంతమేర కొన్ని గ్రామ పంచాయతీల్లో వెనుకబాటుకు గురవుతోంది. ఇక నుంచి అన్ని గ్రామాల్లో ఎరువులు తయారు చేసి రైతులకు అందించే ప్రయత్నం చేస్తాం.

– అనిత, ఎంపీడీఓ

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



వెంకటాపురం(కె): సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎంఈఓ



మంగపేట: సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎంఈఓ మేనక

- ఎంఈఓ సత్యనారాయణరావు

వెంకటాపురం(కె) : మండలంలోని విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి జీవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ క్యాంప్ శనివారం నుం 15 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ క్యాంప్‌లో 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు వినియోగించుకోవచ్చని అన్నారు. ఈ క్యాంప్‌లో ఆటలు , పాటలు, డ్రాయింగ్, యోగా, కరాటే, డ్యాన్స్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర అంశాలను నేర్పుతారని తెలిపారు. క్యాంప్ ఇన్‌చార్జ్‌గా శేష నర్సింహారావు, పి సూర్యనారాయణ, బి శ్రీనివాస్‌లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు ఉన్నారు.

సమ్మర్ క్రీడా క్యాంపు ఏర్పాటు

మంగపేట: మండలంలోని కమలాపురం, రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో వేసవికాలం సందర్భంగా ఏర్పాటు చేసిన సమ్మర్ క్రీడా క్యాంపును ఎంఈఓ పాదెం మేనక శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 23 వరకు నిర్వహించే క్యాంపుల్లో ప్రతీ రోజు ఉదయం 08 గంటల నుంచి 11 గంటల వరకు ఉచితంగా డ్యాన్స్, ఈజీ మ్యాథ్స్ సైన్స్ ప్రయోగాలు, డ్రాయింగ్‌పై అవగాహన కల్పిస్తూ నేర్పించనున్నట్లు తెలిపారు. మండలంలో ఒకటి నుంచి 09వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులు ప్రతి సమ్మర్ క్యాంపులను సద్వినియోగిం చేసుకోవాలన్నారు.

రెండు ఇళ్లల్లో చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఎండీ క్వార్టర్స్‌లో గురువారం రాత్రి రెండు ఇళ్లలో చోరీ జరిగినట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. వేసవి సెలవులు కావడంతో కాశ వేణు, దుర్గం రామదాసు కుటుంబ సభ్యులు వేర్వేరుగా ఊర్లకు వెళ్లారు. ఇళ్లలో శుక్రవారం తెల్లవారు జామున దొంగతనం జరిగినట్లు గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వేణు ఇంట్లో తులం బంగారం, కేజీ వెండి, సెల్‌ఫోన్, రామదాసు ఇంట్లో 8 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.20వేల నగదు చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. క్లూస్ టీమ్ ఘటనా స్థలాలను పరిశీలించి వివరాలు సేకరించింది.